క్లుప్తంగా

తుఫాన్ సమాచారం వెంటనే అందించాలి


గుండ్లకమ్మ వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్

దొనకొండ: గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో ఏమైనా సంఘటనలు జరిగితే వెంటనే తమకు తెలియజేయాలని తహసీల్దార్ డి.రమాదేవి రెవెన్యూ సిబ్బందికి సూచించారు. తుఫాన్ ప్రభావంతో మండలంలో గుండ్లకమ్మ వాగు ప్రవహిస్తే సమస్యలు ఎదురవుతాయని, సంబంధిత వీఆర్‌ఓలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గురువారం ఆమె కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలో ప్రవహించే గుండ్లకమ్మ వాగును వీఆర్‌ఓతో వెళ్లి పరిశీలించారు. గ్రామాల్లోని ప్రజలు తుఫాన్‌తో పాత మిద్దెలు, పూరిళ్లు, రేకుల షెడ్‌లో నివసించకుండా బంధువుల ఇళ్లల్లో తల దాచుకోవాలన్నారు. వాగులు, వంకలతో పంట పొలాలు దెబ్బ తింటే సంబంధిత వీఆర్‌ఓలకు తెలియజేయాలని తహసీల్దార్ కోరారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ

దర్శి: సాంఘిక సంక్షేమ అధికారి పరిధిలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్లు సాంఘిక సంక్షేమ అధికారి షేక్ రాబియా బేగం తెలిపారు. డీఎస్సీ ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి ఎంపికైతే డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

గురవయ్య కుటుంబానికి సాయం


ఆర్థిక సాయం చేస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

దర్శి: స్థానిక హరిజనపాలెంలో బుధవారం మృతి చెందిన కాలూరి గురవయ్య కుటుంబ సభ్యులకు మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆత్మీయ సహకారం అందించారు. అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.5 వేల నగదు చైర్మన్ దేవతి వరప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. దర్శి శాఖ అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, కోశాధికారి గొర్రెపాటి వేణు, వైస్ చైర్మన్ వాకా జనార్దనరెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ పి.రాజశేఖరరెడ్డి, ఈసీ మెంబర్ జె. సుశీలమ్మ, కౌన్సిలర్ బాబు పాల్గొన్నారు.

దీపావళి సామగ్రిని జాగ్రత్తగా ఉంచుకోవాలి

● డీఎస్పీ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

దర్శి: దీపావళి పర్వదినం సందర్భంగా షాపులు ఏర్పాటు చేసుకునే వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో సీఐ రామారావు, ఎస్సై మురళి, మున్సిపల్ చైర్మన్ ఎన్.పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్, ఫైర్ అధికారి జాలయ్య, దర్శి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ల సమక్షంలో షాపులు నిర్వహించే వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. షాపులు నిర్వహించే వారు తీసుకోవాల్సిన లైసెన్సులు, భద్రత చర్యలు వివరించారు.

ఎంఈఓకు షోకాజ్ నోటీసు

కురిచేడు: మండల విద్యాశాఖాధికారి-2 సీహెచ్ సుబ్బారావుకు జిల్లా ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. పాఠశాల విద్య స్వర్ణాంధ్ర 2047కు సంబంధించి 5 సంవత్సరాల యాక్షన్ ప్లాన్ ఈ నెల 5వ తేదీన సమర్పించేందుకు సమగ్ర శిక్ష కార్యాలయంలో హాజరు కావాల్సి ఉంది. ఆ సమావేశానికి హాజరు కాకుండా, యాక్షన్ ప్లాన్ సమర్పించనందుకు జిల్లాలోని 22 మంది ఎంఈఓలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అందులో మండల ఎంఈఓ-2 సీహెచ్ సుబ్బారావు కూడా ఉన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ కమిషనర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

సగిలేరు వాగును పరిశీలించిన ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న సగిలేరు వాగు బ్రిడ్జిని బుధవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పరిశీలించారు. సగిలేరు పరిసర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. వివేకానంద కాలనీలోని కొన్ని గృహాల్లోకి వర్షం నీరు చేరడంతో వారిని పరామర్శించారు. కమిషనర్ డి.వెంకటదాసు, తహసీల్దార్ ఎం.ఆంజనేయులు, వీఆర్‌ఓ వైపీ రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్‌తో రైతుల దిగాలు


పిందె రాలుతున్న చిక్కుడు పంట


గొబ్బూరులో మిరప పంటలో నిల్వ ఉన్న వర్షం నీరు

పెద్దారవీడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి పంటలు సాగు చేసిన రైతులను బెంగ వెంటాడుతోంది. తుఫాన్ కారణంగా మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో మండలంలో సాగు చేసిన పత్తి, మిరప, పొగాకు, కంది, కూరగాయలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే పత్తి, మిరప పంటకు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, కూలీలు తదితర పెట్టుబడుల రూపంలో దాదాపు రూ.50 వేలు వెచ్చించారు. పెద్దారవీడు, తోకపల్లి గ్రామాల్లో 40 ఎకరాలు చిక్కుడు పంట సాగు చేశారు. ప్రస్తుతం పైరు పూత, పిందె దశలో ఉండగా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పూత, పిందె రాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం


తోకపల్లిలో దెబ్బతిన్న చిక్కుడు చెట్లను చూపుతున్న మహిళ

చేస్తున్నారు. ఇంకా వర్షాలు కురిస్తే పత్తి, మిరప పంటలో కూడా పూత, పిందె రాలిపోయే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పూత, పిందె రాలిపోయి నష్టం వాటిల్లగా వర్షాలు కురిస్తే మరింత నష్టం చేకూరుతుందని రైతులు వాపోతున్నారు. వాతావరణ శాఖ అధికారులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలియజేయడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. సాగు చేసిన పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోతుండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లో నుంచి నీటిని బయటకు తొలగించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

మండలంలో పెద్దారవీడు, తోకపల్లి గ్రామాల్లో ఎక్కువగా కూరగాయల పంట సాగు చేశారు. తుఫాన్ వర్షం కారణంగా కూరగాయల పంటలు ఎక్కువ శాతం నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

మిర్చి రైతులు జాగ్రత్తలు పాటించాలి


దొనకొండ: ఆముదం పంటను పరిశీలిస్తున్న ఏఓ

పుల్లలచెరువు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మిర్చి పంటలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి సూచించారు. బుధవారం మండలంలోని నరజాములతండా, పాతచెర్వు తండాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో మిర్చి పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఉరకెత్తిన పొలాల్లో మొక్కలు వెంటనే తేరుకునేందుకు లీటర్ నీటికి 10 గ్రాముల యూరియా, 10 గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. మొక్కలు వడబడి, తలలు వాల్చితే లీటర్ నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. తెగుళ్ల వచ్చే అవకాశం ఎక్కువ ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నేపీ ఎంఐ అధికారి రామయ్య మాట్లాడుతూ డ్రిప్ పరికరాలు 90 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీ రైతులకు తైవాన్ స్ప్రెయర్లు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీఏఏలు ప్రశాంతినాయక్, శాంతిబాయ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: ఆముదం పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని రుద్రసముద్రం, మల్లంపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన ఆముదం పంటను రైతులతో కలిసి సందర్శించారు. మన మండలంలో సుమారు 700 ఎకరాలు ఆముదం పంట సాగు చేశారని, నామాల పురుగు, లద్దె పురుగు ఆశించి ఆముదం ఆకులను తినేసిన పంటను రైతులకు చూపించారు. ఈ పురుగు ఆశించిన వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టకపోతే తీవ్ర నష్టం కలుగుతుందని, ఒకటి, రెండు రోజుల్లోనే ఆకులు అన్నీ తినేసి ఈనెలు మాత్రమే మిగులుస్తాయని రైతులకు సూచించారు. పురుగు ఉధృతి ఎక్కువ ఉంటే ఇమామెక్టిన్ బెంజోవెట్ 100 గ్రా లేదా క్లోరానిలి ప్రోలే 60 మి.గ్రా లేదా ప్రోబెండామైండ్ 40 మి.గ్రా ఏదోక మందును 100 లీ నీటిలో కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలన్నారు. రెండోసారి పిచికారీ చేయాల్సి వస్తే ముందు వాడిన మందును కాకుండా మార్చి వేరే మందును ఉపయోగించి ఆముదం పంటను రక్షించుకోవాలని ఏఓ రైతులకు సూచించారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు నాసర్‌వలి, విన్నీబాబు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: తాము పండిస్తున్న పంటలను ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు నష్ట పరిచే పరిస్థితి ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని తమ్మడపల్లె, గుర్రపుశాల గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయనతో పాటు ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి పత్తి, మిరప, కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ముందస్తు చర్యల కింద పొలాల్లో నీరు నిల్వ చేరకుండా చూసుకోవాలని, వర్షాలు తగ్గిన వెంటనే ఆ నీటిని పూర్తిగా బయటకు పంపాలన్నారు. పత్తి పంట అధిక తేమతో మొక్కలు భూమి నుంచి పోషకాలను గ్రహించే స్థితిలో ఉండవని, ఇటువంటి పరిస్థితుల్లో మొక్కలు ఎర్రబడటం, వడలి పోవడం, ఎండిపోతాయని తెలిపారు. ఈ పరిస్థితుల నివారణకు 20 గ్రాములు యూరియా లేకుంటే 20 గ్రాముల పొటాషియం నైట్రేట్, 10 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్‌తో లీటర్ నీటిని కలిపి ఐదు నుంచి 7 రోజుల కాలంలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. ఆకు మచ్చ తెగులు కూడా ఆశించే అవకాశం ఉందని, దాని నివారణకు మూడు గ్రాములు కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు. హెచ్‌వో మాట్లాడుతూ పొలాల్లో తేమ ఆరిన వెంటనే పైపాటుగా 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాషియాన్ని ఇచ్చే ఎరువులు చల్లాలన్నారు. వేరు కుళ్ల తెగులు ఆశిస్తే మూడు గ్రాములు కాపర్ ఆక్సీ క్లోరైడ్, ఒక గ్రాము ప్లాంటో మైసిన్ లీటర్ నీటిలో కలిపి మొక్క మొదలు దగ్గర పోసి తెగులు నివారించుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారి ఎల్.మాల్యాద్రిరెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది షేక్ సూరజ్‌బాషా, షేక్ వలి పాల్గొన్నారు.


త్రిపురాంతకం: మేడపిలో అవగాహన సదస్సుకు హాజరైన రైతులు


దర్శి: వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ బాలకృష్ణ


కురిచేడు: పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

త్రిపురాంతకం: ఖరీఫ్‌లో ఈ-క్రాప్ ద్వారా నమోదైన రైతులకు పంటనష్టం జరిగితే పరిహారం అందుతుందని వ్యవసాయ సహాయకుడు మస్తాన్ నాయక్ తెలిపారు. మండలంలోని మేడపిలో ఈ-క్రాప్‌పై గ్రామసభ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకుంటే ప్రయోజనం పొందుతారన్నారు. రైతులకు ఈ-క్రాప్ ద్వారా సబ్సిడీలు అందనున్నట్లు వివరించారు.

కురిచేడు: రైతులు పంట యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన తన సిబ్బందితో బుధవారం మండలంలోని కల్లూరు, పడమరకాశీపురం గ్రామాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. పొగాకు, వరి, మొక్కజొన్న, మిరప పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినకుండా, పురుగులు, తెగుళ్ల ఆశించకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని వారికి సూచించారు. బిందు సేద్యం, తుంపర సేద్యం గురించి, దానికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీల గురించి ఎంఐఏఓ కె.వెంకటేశ్వర్లు, వివరించారు. వీఏఏలు టి.అనిల్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దర్శి: పంటలను ఆశిస్తున్న చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణ కోరారు. మండలంలోని వెంకటాచలంపల్లిలో రైతులు సాగు చేసిన పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి రైతూ వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు తమ పొలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఎకరాకు కిలో చొప్పున 13.0.45 లేక 19.19.19 లేక 17.17.17 లను పిచికారీ చేసుకోవాలన్నారు. ఉద్యానవన శాఖ అధికారి మాట్లాడుతూ రైతులకు 90 శాతం రాయితీపై బిందుసేద్య పరికరాలు అందిస్తున్నామన్నారు. ప్రతి రైతు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కౌలురైతులకు కూడా పథకం వర్తిస్తుందని, రైతులు తప్పనిసరిగా కౌలు రైతు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బసవయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


వైపాలెం: రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు


పుల్లలచెరువు: రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో నిర్మలాదేవి

వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

కొమరోలు: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల వద్ద ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. కొమరోలు మండలంలోని బాదినేనిపల్లి సమీపంలో ప్రవహిస్తున్న పులి వాగును బుధవారం సబ్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్, ఎంపీడీఓలతో కలిసి జేసీ పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. రాబోయే రెండు రోజుల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

కొమరోలు తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ తనిఖీ చేశారు. కార్యాలయంలోని అన్ని గదులను పరిశీలించి, సమస్యలపై సిబ్బందిని ఆరా తీశారు.

కంభం చెరువు పరిశీలన

కంభం: కంభం చెరువును బుధవారం జేసీ గోపాలకృష్ణ పరిశీలించారు. గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువుకు వరద నీరు వచ్చి చేరుతోంది. మరో 24 గంటలు వర్షాలు పడే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

చెన్నారెడ్డిపల్లి వాసికి కలాం ప్రతిభా పురస్కారం

తర్లుపాడు: మండలంలోని చెన్నారెడ్డిపల్లికి చెందిన వెన్నా నారాయణరెడ్డికి గుంటూరుకు చెందిన సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ డాక్టర్ అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభా పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పి. నాగయ్య, గౌరవాధ్యక్షుడు ఎంఎల్‌సీకే లక్ష్మణరావు నుంచి లేఖ అందినట్లు నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా ఖాజీపాలెంలోని కేవీఆర్‌అండ్ ఎంకేఆర్ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

కోటయ్య మృతికి సంతాపం


సంతాపం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు

త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీ నాయకుడు భీమిశెట్టి కోటయ్య మృతిపై యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని కేశినేనిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన భీమిశెట్టి కోటయ్య సౌమ్యుడు, పెద్దలు, పిల్లలు తేడా లేకుండా అందరితో కలిసే స్నేహ భావంతో ఉండే వాడని, వైఎస్సార్ సీపీకి విధేయుడిగా పనిచేసారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

మాజీ మంత్రి సురేష్ నివాళి

భీమిశెట్టి కోటయ్య మృతదేహానికి మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కోటయ్య పార్టీకి తీరని లోటని, ఎప్పుడూ గ్రామ సమస్యలపై పనిచేసే వారన్నారు. ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి వన్నె తెచ్చారని పేర్కొన్నారు. వీరి వెంట మాజీ ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్, మండల పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, కో కన్వీనర్ చల్లా యల్లారెడ్డి, పార్టీ నాయకులు రమణారెడ్డి, గుడిమెట్ల రంగయ్య, రంగబాబు, గురవారెడ్డి, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు


ఒబ్బాపురంలో వర్షానికి నిలిచిన నీరు

దొనకొండ: స్థానిక ఒబ్బాపురంలో అంతర్గత రోడ్లు వర్షానికి అధ్వానంగా తయారయ్యాయి. వర్షం కురిసిన సమయంలో నీరు ఇళ్లల్లో చేరి రోడ్లపై నిలుస్తున్నాయి. వాహన చోదకులు ఇంట్లో నుంచి బయటకి రావాలంటే ఇబ్బందికరంగా ఉంది. నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వర్షం పడితే పది రోజుల పాటు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజలు బయటకు వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో విష సర్పాలు తిరుగుతుంటాయి. చుట్టుపక్కల ప్రజలు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

స్తంభించిన జనజీవనం


జనం లేక వెలవెలబోతున్న బస్టాండ్ సెంటర్

కురిచేడు: మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. ఎక్కడా వరదలు వచ్చి ఇళ్లు మునిగిన సంఘటనలు చోటుచేసుకోలేదు. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. మార్కెట్ సెంటర్లో రద్దీగా ఉండే షాపులు, వ్యాపారులు, ప్రజలు కనిపించడం లేదు. కేవలం ఇళ్లకే పరిమితమయ్యారు. బయటకు వచ్చేందుకు కూడా వీల్లేకుండా వర్షం కురుస్తోంది. పేదలు, కూలీలు పనులు లేక, పొయ్యిలు, కట్టెలు తడిసిపోయి వంట చేసుకునేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు జరగక ఖాళీగా కూర్చుంటున్నామని, అద్దెలు, గుమస్తాల జీతాలు కూడా వ్యాపారంలో రావడం లేదని వాపోతున్నారు. వస్తే వరద లేకపోతే ఎండ అన్న చందంగా ఈ ఏడాది తయారైందని ప్రజలు ఇళ్లకే పరిమితమై విలవిల్లాడిపోతున్నారు. పొలం పనులు ఆగిపోవడంతో రోజు వారి పనులు చేసుకుని జీవనం సాగించే వారికి రోజులు గడవటం కష్టంగా మారింది. ప్రభుత్వం పేదలకు నిత్యావసరాలు సరఫరా చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాల జలమయం


పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు


పాఠశాల ప్రధాన గేటులో నిలిచిన నీరు

తాళ్లూరు (దర్శి): మూడు రోజులు గాకురుస్తున్న వర్షాలకు మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జలమయమైంది. పాఠశాల ఆవరణంతా తటాకాన్ని తలపిస్తోంది. వారం రోజుల పాటు పిల్లలు, సిబ్బంది పాఠశాలలోకి వెళ్లే అవకాశం లేకుండా నీరు చేరింది. పాఠశాలకు పడమర వైపు రోడ్డు ఎత్తుగా వేయడంతో ఆవరణలోకి నీరు చేరింది. పాఠశాల ఆవరణంతా మట్టి తోలించి ఎత్తు పెంచకపోతే రాబోయే రోజుల్లో కూడా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పాఠశాల ఆవరణ ఎత్తు పెంచేందుకు నిధులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

ఆస్పత్రిలో అప్రమత్తంగా ఉండండి

● జీజీహెచ్ సిబ్బందికి సబ్ కలెక్టర్ సూచన


రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీజీహెచ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. బుధవారం రాత్రి ఆయన జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు జీజీహెచ్ ఆవరణలో విద్యుత్ వైర్లు తెగిపోయి సుమారు 8 గంటలపాటు సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో ఆస్పత్రిని తనిఖీ చేశారు. సాయంత్రం 5 గంటలకల్లా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి సబ్‌కలెక్టర్‌కు వివరించారు. వాయుగుండం నేపథ్యంలో రానున్న 48 గంటలపాటు అందరూ అప్రమత్తంగా ఉండాలని, డెలివరీ అయిన మహిళలను ఇళ్లకు పంపేటప్పుడు మధ్యలో వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయేమో కనుక్కోవాలని స్పష్టం చేశారు. నిండు గర్భిణులను గుర్తించి ముందుగానే వైద్యశాలలో చేర్చుకుని సేవలు అందించాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విద్యుత్ వైర్లు తెగిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పొన్నలూరు: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీఓ సుజాత అన్నారు. మండలంలోని వెంకుపాలెం, చెరుకూరు గ్రామాల్లో బుధవారం సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు గ్రామాల్లో రూ.35 లక్షలతో అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా నిర్మిస్తామన్నారు. పీఆర్ జేఈ కోటేశ్వరరావు, ఈఓఆర్డీ నాగేశ్వరరావు, ఏపీఓ మాచర్ల తదితరులు పాల్గొన్నారు.